విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు,సోమవారం 11, మార్చి 2024

తాలూకా ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆళ్లగడ్డ తాలూకా జనరల్ బాడీ సమావేశం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ తాలూకా ఏఐవైఎఫ్ నూతన కమిటీని జిల్లా కార్యదర్శి నాగ రాముడు ప్రకటించారు. ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులుగా పెద్దారెడ్డి, కార్యదర్శిగా మధు, కోశాధికారిగా రమేష్‌లతో పాటు 9 మంది ఆఫీస్ బేరర్స్‌తో, 21 మంది కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఫరూక్..భూమాలు రాజీ

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాలలో తెలుగుదేశంపార్టీ జెండా ఎగురవేస్తామని నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన టీడీపీ కార్యక్రమంలో లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల నుండి ఫరూక్, భూమా బ్రహ్మానందరెడ్డి పార్టీ పిలుపుమేరకు లోకేష్‌ను కలిశారు. ఫరూక్, భూమాల మధ్య లోకేష్ సయోధ్య కుదిర్చారు. ఈ సందర్భంగా లోకేష్ ఎదుట నంద్యాల టీడీపీ అభ్యర్థి, మాజీమంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డితో చేతులు కలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చారు. ప్రభుత్వం వచ్చాక తగిన గౌరవం ఇస్తామని భూమా బ్రహ్మానందరెడ్డికి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఎన్ఎండీ ఫరూక్?తో కలిసి పని చేస్తానని భూమా బ్రహ్మానందరెడ్డి తెలిపారు. నంద్యాలలో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని తెలిపారు. నంద్యాలలో బలమైన నాయకుడు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కలయికతో టిడిపి గెలుస్తుందని టిడిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్ కు చేరిన పరీక్ష పత్రాలు

విశాలాంధ్ర-రుద్రవరం : పది తరగతి పరీక్షపత్రాలు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరడంతో అక్కడే వాటిని భద్రపరిచినట్లు ఇన్చార్జి ఎంఈవో కోటయ్య, కస్టోడియన్-1,2 అధికారులు సుబ్బరాయుడు, బాలగురప్పలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సెట్-1, ప్రశ్న పత్రాలు తెలుగు, ఇంగ్లీష్, గణితం, హిందీ, పి.సెన్స్, ఎస్.సైన్స్, సోషల్ పత్రాలు జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు భద్రపరిచినట్లు వారు తెలిపారు. ఈనెల 18 నుండి 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందులో జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ రుద్రవరం, నరసాపురంలోని థామస్ మార్తోమ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో 512 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవు తారన్నారు.

యాగంటి క్షేత్రంలో పలు కార్యక్రమలు వాయిదా

విశాలాంధ్ర-బనగానపల్లె : మండల పరిధిలో యాగంటి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (సోమవారం) జరగవలసిన పలు కార్యక్రమాలు వాయిదా వేస్తున్నట్లు ఈవోచంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డిలు తెలిపారు. స్వామి మాల విరమణ సందర్భంగా స్వామివారికి భక్తులు సాముహిక నిర్వహించే సామూహిక అభిషేకాలు, సాయంత్రం నిర్వహించే వల్లకి ఉత్సవాలు రద్దు చేస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు సహకరించగలరని కోరారు.

నీటి ఎద్దడి నివారించడానికే..



విశాలాంధ్ర-నందికొట్కూరు : నియోజకవర్గ కేంద్రమైన నందికొట్కూరులోని కోటా వీధి-18, 19 వార్డుల్లో ప్రజలకు నీటి ఎద్దడి నివారణ కోసమే బోరు పనులు ప్రారంభించినట్లు పురపాలక సంఘం చైర్మన్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా వార్డుల పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. బైరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఈ నూతన బోరుకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ఉపేంద్రరెడ్డి, గోవిందరెడ్డి, వెంకటరెడ్డి, భాస్కర్, రంగారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్, తిరుపాలు, రాఘవ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే వైసీపీ ఖాళీ కావడం తథ్యం

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాల పట్టణంలోని 5వ వార్డు నడిగడ్డలోని వైసీపీ కుటుంబాలు పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో చేరాయి. మాజీమంత్రి శిల్పా మోహన్ రెడ్డి ముఖ్య అనుచరుడు హాజీతో పాటు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఫిరోజ్ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో వైసీపీ ఖాళీ కావడం తథ్యమన్నారు. వైసీపీ ఎన్ని పన్నాగాలు పన్నినా టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు. నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

విశాలాంధ్ర-జూపాడుబంగ్లా : 2024-25 విద్యా సంవత్సరానికి గాను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ కోర్సులలో ప్రవేశ నిమిత్తం విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించిన ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 224 మంది విద్యార్థులు గైరాజరయ్యారని ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. 790 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉండగా 566 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ ఫస్టియర్ ప్రవేశ పరీక్షకు 563 మంది విద్యార్థులకు గాను 48 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. 75 మంది విద్యార్థులు గైరాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షల్లో మార్కుల ఆధారంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ ప్రవేశపరీక్షల అబ్జర్వర్‌గా రామసుబ్బారెడ్డి,డిపార్టుమెంటల్ చింతలయ్య, ఎగ్జామ్‌చీఫ్‌గామూర్తి వ్యవహరించారు.

ఒడిస్సా ఎన్నికల అధనపు అధికారిగా



విశాలాంధ్ర-అవుకు: నంద్యాల జిల్లా అవుకు కు చెందిన 2009 బ్యాచ్ ఐఏఎస్‌కు చెందిన ఎం. తిరుమల నాయక్‌కు ఒడి శా ప్రభుత్వం కీలక బాధ్య తలు అప్పగించింది. ఈ మేరకు ఆయన చరవాణి ద్వారా సమాచారం అందించారు.ఒడిశా రాష్ట్ర అధనపు ఎన్నికల అధికారిగా, ప్రభుత్వ అధనపు కార్యదర్శిగా ఆయనను నియమించింది. గతంలో పలు జిల్లాల కలెక్టర్, కమిషనర్ హెూదాల్లో పని చేశారు. సంజామల పశువైద్యశాలలో పశు వైద్యా ధికారిగా ఆయన సేవలందించారు. ఈయన సోదరుడు హరిశవ్య నాయక్ విద్యుత్ శాఖ ఏడీగా కడప జిల్లాలో పనిచేస్తున్నారు. అవుకు పట్టణానికి చెందిన తిరుమల నాయక్ ఒడిశా రాష్ట్రం కీలక పదంలో నియమించడంతో ఆయన మిత్రులు, బంధువులు అభినందించారు.

సోలార్ ప్రాజెక్టు నుండి రైతుల భూములను కాపాడండి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు ఎస్టీయూ నాయకుల వినతి

విశాలాంధ్ర-నంద్యాల అర్బన్ : సోలార్ ప్రాజెక్టు నుండి రైతుల భూములు కాపాడండని ఎస్టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్, రాష్ట్ర మాజీ సహాధ్యక్షుడు ఎస్. చంద్రశేఖర్‌లు సిపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యం. అజాంబేగ్, రాష్ట్ర మాజీ సహాధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కలిసి కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం ఉయ్యాల వాడ గ్రామంలో సోలార్ ప్రాజెక్టు కొరకు దాదాపు 3 వేల ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు జిల్లా కలెక్టరు ప్రకటన చేశారన్నారు. ఇప్పటికే డీఆర్డీవో కోసం వేల ఎకరాల భూమిని రైతులు కోల్పోయారు.సోలార్ కొరకు ఉన్నభూమి పోతేచిన్న, సన్నకారు రైతుల బతుకులు రోడ్డున పడకుండా రైతులకు అండగా ఉండాలని కోరుతూవినతిపత్రం అందజేశామన్నారు. దీనికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్పందిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పార్టీ తరుపున ప్రతిపాదన చేసి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చేస్తానని రామకృష్ణ వారికి భరోసా ఇచ్చారన్నారు.

హాస్పిటల్లో పనిచేస్తున్న కార్మికులకు రెగ్యులర్ చేయాలి- ఏఐటీయూసీ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం సమావేశం జి.ప్రసాద్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్స్‌లో పని చేస్తున్న శానిటేషన్, వర్కర్స్‌కి జీతాలు పెంచాలని, కాంట్రాక్టర్లు ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, పిఎఫ్ డబ్బులు బకాయిలతో పాటు చెల్లించాలని, ఈఎస్ఐ ఫ్యామిలీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, హాస్పిటల్స్‌లో వర్కర్స్ సంఖ్యను పెంచాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి శివ బాలకృష్ణ ,మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సుశీలమ్మ, డి శ్రీనివాసులు మహేష్, ప్రసాదు,తులసమ్మ, రమణమ్మ ,శివ, పుల్లయ్య, సులోచనమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

- నేల చూపు చూస్తున్న అరటి ధరలు - నష్టాలను మూటకట్టుకుంటున్న అన్నదాతలు
- నెలలోపే టన్ను రూ.18 వేల నుండి 8 వేల దిగువకు- లబోదిబోమంటున్న రైతన్న

అరటి రైతుల ఆశలు ఆవిరి

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : అరటి ధరలు రోజురోజుకు నేలచూపు చూస్తుండడంతో రైతన్నలు కలవర పడుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాని దుస్థితితో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు అప్పుచేసి సాగు చేసిన పంట తీరా చేతికి వస్తున్న వేల ధర పతనమవుతుండడంతో నష్టాలను మూటకట్టుకుంటున్నారు. నెలరోజుల క్రితం టన్ను రూ. 18 వేలకు పైగా పలికిన ధర రోజురోజుకు పతనమవుతూ నేడు రూ.8 వేలకు దిగి నేలను తాకుతోంది.ధర ఇంకా ఎంత దిగువకు పతనమవుతుందోనని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.నెల రోజులు ముందు అక్కడక్కడ కొంత మంది అరటిరైతులు టన్ను రూ.18 వేలకు పైగా అమ్ముకోగా, నేడు ధరను చూసి మాత్రం చాలామంది రైతులు కన్నీరు పెడుతున్నారు. మండలంలోని మదనంతపురం, అబ్దుల్లాపురం, కోరుమానుపల్లి, చెన్నంపల్లి, చింతలాయపల్లి, కొలిమిగుండ్ల, పెట్నికోట,తోళ్లమడుగు, తదితర గ్రామాల పరిధిలోని రైతులు దాదాపు 500కు ఎకరాలకు పైగా అరటిని బోరు బావులు కింద సాగు చేశారు. ఒక్క మదనంతపురం గ్రామ పరిధిలోని దాదాపు 200 ఎకరాలకు పైగా అరటిపంట సాగులో ఉన్నది. ఒక ఎకరా సాగుకు రూ.లక్షన్నర పైగా ఖర్చవుతున్నది. అరటి మొక్కలు, ఎరువులు, భూమి చదును,కూలీల ఖర్చులు, మందులు తదితర వాటికి ఖర్చు పెడుతున్నారు. మొదటి పంట దిగుబడి బా గా వచ్చిమార్కెట్లో ధర కూడా బాగా ఉండాల్సింది పోయి నేల చూపు చూస్తోంది. దిగుబడి ఓమోస్తరుగా ఉన్నప్పటికీ ధర పతనంతో నష్టపోవలసి వస్తున్నదని రైతన్నలు వాపుతున్నారు. ధర కోసం మరికొన్ని రోజులు వేచి ఉందామన్న రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతన్నలు మరింత ఆందోళన చెందుతున్నారు.దింతో చేతికి వస్తున్న పంటను ఎంతో కొంతకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. అక్కడక్కడ రెండోవ, మూడవ పంట ఉన్న కొనుగోలు చేసే వ్యాపారి కనపడడం లేదని, రైతన్నలే సొంతంగా ఆటోలలో పంటను తీసుకుపోయి టన్ను రూ.2వేలకే అమ్ముకుంటూ నష్టపోతున్నారు. గతేడాది ఇదే సమయానికి అరటి టన్ను రూ.27వేల పైగా పలకడంతో చాలామంది రైతులు అరటి సాగుపై ఆసక్తి కనపరిచారు.

అభివృద్ధి గంగులకే సాధ్యం -ఎమ్మెల్యే గంగుల

విశాలాంధ్ర -చాగలమర్రి : ఆళ్ళగడ్డ నియోజకవర్గ అభివృద్ధి గంగుల కుటుంబానికే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు.ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో రూ.12 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దబోధనం నుండి తోడేండ్లపల్లి బిటి రోడ్డు ను, ఎం.తండా, చక్రవర్తులపల్లె, తోడేండ్లపల్లె, ముత్యాలపాడు, ఓజీ తాండ, డి.కొత్తపల్లి, చాగలమర్రి, పెద్ద వంగలి, చిన్నవంగలి గ్రామాల్లో సిమెంటు రోడ్లను ప్రారంభించారు. అలాగే మండల కేంద్రమైన చాగలమర్రిలో గ్రామసచివాలయ భవనాలు, పెద్ద వంగలిలో రైతుభరోసా కేంద్రాన్ని, డి.వనిపెంటలో సచివాలయ భవనం, చెంచుగూడెం వద్ద భవనాసి నదిపై కొత్తగా నిర్మించిన వంతెనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, జడ్‌పి టిసి లక్ష్మిదేవి, జేసిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ బాబూ లాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర సేవాదల్ కార్యదర్శి రమణ, పీఆర్‌డీఈ నరసింహులు, ఏఈలు కొండా రెడ్డి, జయన్న, సర్పంచులు గోవిందయ్య, శంకరమ్మ, బాలీశ్వరరెడ్డి, తులసమ్మ, షరీఫ్, శివమ్మ, మౌళిబాష, ఎంపిటీసీలు పత్తి నారాయణ, వెంకట రాముడు, శంకరిబాయి, నరసింహులు, లక్ష్మిరెడ్డి, ఫయాజ్, వైసీపీ నాయకులు శేషురమేష్, శ్రీనివాసులు, రహమాన్,మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రవి, సుబ్బయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి గణేష్ రెడ్డి, రహ మాన్, జబ్బార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

అహెూబిలేసుడికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి రోజా

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహెూబిలం లక్ష్మీ నరసింహ స్వామిని, అమ్మవారిని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసుల మరియు క్రీడా శాఖ మాత్యులు ఆర్కేరోజా ఆదివారం దర్శించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు. అహెూబిలం పారువేట ఉత్సవాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయం విదితమే. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు అందించేందుకు వచ్చిన మంత్రి ఆర్కే రోజా, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, జలవనుల శాఖ రాష్ట్ర గౌరవ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి లకు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు, అర్చక బృందం, మఠం అధికారులు జివిఏ సంపత్, ఓ ఎస్ డి శివప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతురామన్ లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రహ్లాద వరద స్వామికి పట్టు వస్త్రాలు , సారే మంత్రి రోజా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందజేశారు. అనంతరం ఆలయంలో కొలువైన ప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో మంత్రి రోజా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జల వనరుల శాఖ రాష్ట్ర గౌరవ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డిలను ప్రధాన అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించి నవనారసింహుల చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, ఆళ్లగడ్డ సొసైటీ అధ్యక్షులు ఇంజేటి శివ శంకర్ రెడ్డి, నాయకులు శివనాగిరెడ్డి, గోపవరం నరసింహారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సీఐ హనుమంతు నాయక్, ఎస్ఐ నరసింహులు తదితరులున్నారు.

ఎన్నికలు నీతికి..అవినీతికి మధ్యే పోటీ- కోట్ల

విశాలాంధ్ర -బేతంచెర్ల: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలు నీతికి అవినీతికి మధ్య పోటీ జరగబోతుందని అంతిమంగా విజయం నీతిదేనంటూ మాజీ కేంద్ర మంత్రి,డోన్ టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ ఎల్లా నాగయ్య అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఆయన పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాన్ని పాలించే రాజే సరిగ్గా లేనప్పుడు అరాచకం రాజ్యమేలుతుందని,ప్రస్తుత ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్ రెడ్డి నియోజకవర్గంలో అలాంటి అరాచకాలే పోలీసులను అడ్డుపెట్టుకుని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి,భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇదిమంచి పద్ధతి కాదని సున్నితంగా హెచ్చరించారు. తాము నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడంతో ,తమపైన ప్రజలకు నిండైన మనస్సు ఉందని,ఇంటికి వచ్చిన ప్రతి కార్యకర్తకు భోజనం పెట్టి పంపుతామని పిల్లికి భిక్షం పెట్టని నీవు,పార్టీ కోసం పని చేసే ఏ కార్యకర్తకు అన్నం పెడతావు లే అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.ఇక నుండి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని ఎవరూ భయపడాల్సిన పని లేదంటూ ఆయన కార్యకర్తలకు భరోసానిచ్చారు.ఇక ఆర్థిక మంత్రి అసెంబ్లీలో పిట్ట కథ చెప్పే పిట్టల మంత్రి, నిధుల విషయంలో అప్పుల మంత్రి, నియోజకవర్గానికి రేకుల మంత్రి అంటూ తమ దైన శైలీలో మాటల తూటాలు సంధించారు. అంతే కాకుండా కోట్ల,కే యి ఫ్యామిలీలు ఏనాడు ఫ్యాక్షన్ ని ప్రోత్సహించలేదని,తమ ద్వార 200 మంది వితంతువులుగా మారారంటూ అనవసరమైన విమర్శలు చేస్తున్నారని,ఆ 200 మంది వితంతువుల ను తీసుకొస్తే నేను పోటీ నుండి తప్పుకుంటానని, అలా నిరూపించకపోతే నీవు పోటీలో నిలబడకూడదంటూ సవాలు విసిరారు.మండలంలో ఒకే ఒక సిమెంట్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా, స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పించి,స్థానిక యువతను విస్మరించారని,తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానికులకే సిమెంట్ ఫ్యాక్టరీ నందు ఉద్యోగాలు కల్పిస్తామంటూ యువతకు భరోసానిచ్చారు. వీటితో పాటు ప్రత్యేక హెూదా సాధనకి కృషి చేస్తామని,తద్వారా పరిశ్రమలు,యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈసమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ నాయకులు పోలు రాఘవరెడ్డి, భీమేష్ రెడ్డి, ప్రసన్నలక్ష్మి, జాకీరుల్ల బేగ్,రూబెన్, రవీంద్ర నాయక్, మోహన్‌గౌడ్, రంగారెడ్డి, ఎరుకల చెరువు శివ, సర్పంచులు శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, కౌన్సిలర్ అంజి, జనసేన నాయకులు చాముండేశ్వరి దేవి, చల్లా మద్దిలేటి, నాగరాజు, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర -శ్రీశైలం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 11 రోజులపాటు నిర్వహించబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 10వ రోజైన ఆదివారం ఉదయం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి యాగశాలలో చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృతం, త్రిశూలస్థానం కార్యక్రమాలు అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూర్ణాహుతి ద్రవ్యాలు శాస్త్రోక్తంగా హెూమంలో సమర్పించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా బ్రహ్మోత్సవాల మొదటి రోజు ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేశారు. అనంతరం సదస్సు నాగవల్లి కార్యక్రమాలను ఆగమ శాస్త్రానుసారంగా అర్చక స్వాములు పూర్తి గావించారు.

ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి డి పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు చక్రపాణి రెడ్డి, ఆలయ అర్చక వేద పండితులు పాల్గొన్నారు. నేటితో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

భక్తజన సందోహం మధ్య యాగంటీశ్వరుడి రథోత్సవం

బనగానపల్లె: మాహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఆలయ ప్రత్యేకాధికారి పాండురంగారెడ్డిల ఆధ్వర్యంలో భక్తజన సందోహం మధ్య రథోత్సవం సాగింది. దేవాలయ ప్రాంగణంలో విశేషపూజలు, అర్చనలు, హారతులందుకున్న ఉత్సవ మూర్తులను పల్లకిలో తోడ్కొని భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ రథం వద్దకు చేర్చారు. రథంపై అధిష్టింపజేసి సాత్విక బలిగా కొబ్బరి, గుమ్మడి కాయలను సమర్పించారు. అనంతరం ఓంకార ధ్వనుల మధ్య భక్తులు రథాన్ని ముందుకు లాగారు.

మరమ్మతులకు నోచుకోని కేజీలు - సీపీ నగర్‌లో నీటికి కటకట

విశాలాంధ్ర-వెలుగోడు: వేసవికాలం రాకముందే నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. స్థానిక సి.పి.నగర్ లో నీటికి కట కట ఏర్పడింది. నీటికోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెలుగోడులో అతి పెద్ద కాలనీ సి.పి.నగర్ అని చెప్పవచ్చు. ఈకాలనీకి పంపు హౌస్ నుంచి శుద్ధి చేసిన నీటిని అధికారులు అందించాల్సిన అవశ్యకత ఉండగా , ఈ కాలనీ ట్యాంక్ కు అందించే పైప్ లైన్ రెండు చోట్ల లీకేజీ ఏర్పడింది. ఈ సమస్య ఏర్పడి చాలా రోజులు అవుతుంది. వీటి మరమ్మతులకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. రెండు గంటల్లో నిండాల్సిన ట్యాంక్ లీకేజీలతో 9 గంటలు పడుతుంది. వినాయకగుడి వద్ద లీకేజీ , ఆసుపత్రి వెనుక భాగంలో మరో లీకేజీ ఏర్పడింది. ట్యాంక్ వద్ద బోర్ ద్వారా నీటిని అందిస్తున్నారు.ఈ నీరు ప్రజలకు ఏ మాత్రం చాలడం లేదు.ఆ బోర్ కూడా ఆదివారం పెయిల్ అయినట్లు సమాచారం. కాలనీ వాసులకు రెండు రోజులకు ఒకసారి కేవలం అర గంట పాటు నీటి సరఫరా చేస్తే , మోటార్లు ఉన్న వారికి నీరు అందుతాయి. మోటార్లు లేని ప్రజల కు చుక్క నీరు రావడం లేదు. ఓట్ల కోసం వచ్చే నాయకులు , ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. అధికారులను సంప్రదించాలని చూస్తే ఎలాంటి రెస్పాన్స్ లేదు. రెండు రోజులుగా సి.పి.నగర్ వాసులు నీటి కోసం తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రమణీయం చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం

విశాలాంధ్ర-నందికొట్కూరు: మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో అతి ప్రాచీనమైన చరిత్ర కలిగిన శ్రీకాశి చంద్రమౌళీశ్వర స్వామి రథోత్సవం వేడుకలు అత్యంత వైభవంగా అశేష జనవాహిని మధ్య ఆదివారం సాయంత్రం నిర్వహించారు. సూర్యా స్తమ సమయం అనంతరం ఆలయఅర్చకులు వేద మంత్రోచ్ఛ రణలమధ్యస్వామివారి కల్యాణ మూర్తులను దివ్య రథంపై మూర్తిం వజేసి రథోత్సవం ప్రారంభించారు. అపశృతులు దొర్ల కొండ అన్నపు రాశిని బలిహారణ సమర్పించి శివాలయం ప్రధానార్చకులు ఆధ్వర్యంలోపూజాది కార్యక్రమాలునిర్వహించారు. అనంతరం శివాలయం వద్ద నుండి ప్రారంభమైన రథోత్సవం అధిక సంఖ్యలో హాజరై గ్రామ ప్రధాన వీధి అంతా భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. గ్రామస్తులు రథం లాగుతూ హర హర మహాదేవ శంభో శంకర అంటూ ఉత్సాహంగా రథాన్ని మెయిన్ బజార్ నుండి ఆంజనేయస్వామి గుడి వద్దకు కిక్కిరించిన జనంతో సాగింది. స్థానిక ప్రజలు శ్రీకాశీ చంద్రమౌళీశ్వర స్వామి వారికి కాయ కర్పూరాలతో హారతి సమర్పించారు. ఈ రథోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ సి ఐ ఓ విజయభాస్కర్ ఎస్సై వి వెంకటరమణ పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో పూర్తి బందోబస్తుతో భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అత్యంత వైభవంగా రథోత్సవం సాగింది.రథోత్సవానికి ముఖ్య అతిథులుగా షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మండల పరిషత్ అధ్యక్షులు మురళి కృష్ణారెడ్డి,వైస్ ఎంపీపీ పబ్బతి రవి సర్పంచు రవి యాదవ్ బాలకృష్ణ యాదవ్, శ్రీరాములు, ఓంకార్ రెడ్డి హాజరయ్యారు ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 11, మార్చి 2024

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర- కల్లూరు: మండలం ఉలిందకొండ గ్రామంలో ఉమ్మడి తెలుగు దేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున ర్యాలీ కార్యక్రమం జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే పాణ్యం ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థి గౌరు చరిత రెడ్డి మరియు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు చింత సురేష్ జనసేన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు సుబ్బయ్య , తెలుగు దేశం పార్టీ గ్రామ సీనియర్ నాయకులు రమణ,రంగ స్వామిరెడ్డి, నాగప్ప, యుద్ధం శ్రీనివాసులు, బట్టు సుబ్బరాయుడు,.మురళి, యుద్ధం శ్రీకాంత్, కలాం, ప్రసాద్, విక్రమ్ , రమణ, కరీం, మహేంద్ర, సురేష్, రామాంజి, అశోక్, హరి, జిలాన్, హనుమన్న జనసేన గ్రామ నాయకులు,రాజు,రాకేష్ కుమార్, శ్రీమన్ , బిల్డింగ్ రాజు,నరసింహ, కరెంట్ కిట్టు, వరప్రసాద్, సుధాకర్, తడకనపల్లే సలాం,షబ్బీర్,తదితరులు పాల్గొన్నారు.

ఉలిందకొండ గ్రామంలో నుండి త్వరలో జరగబోయే ఎన్నికలకు ఉమ్మడి పాణ్యం నియోజకవర్గం అభ్యర్థిగా ఎన్నుకోబడిన గౌరు చరితరెడ్డిని అత్యధిక మెజార్టీ తో ధీమా వ్యక్తం చేశారు.

జిల్లా సదస్సులు జయప్రదం చేయండి -ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకుల నిర్లక్ష్యం యువత కర్తవ్యం అనే అంశంపై అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 15వ తేదీన కర్నూల్ నగరంలో సి ఆర్ భవన్ లో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యు కారుమంచి పిలుపునిచ్చారు ఆదివారం నాడు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక సిఆర్ భవన్ నందు ఆయన విడుదల చేశాడు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో యువత అధికంగా ఉన్నప్పటికీ యువతకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్ల 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో ఇంకా అభివృద్ధి చెందుతూనే ఉన్నామని ఇందుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమని కారుమంచి విమర్శించాడు 2014 ఎన్నికలకు ముందు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ అధికారం చేపట్టి పది సంవత్సరాలు కావస్తా ఉన్న ఉద్యోగాలు కల్పించకపోగా ఉపాధి కల్పిస్తున్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్ రైల్వే ఎల్ఐసి బిఎస్ఎన్ఎల్ విమానాశ్రయాలు బొగ్గు గనులు కారు చౌకగా కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పు దాదాపు ఒక లక్ష 30 వేల ఉద్యోగాలు ఉడగొట్టిన ఘనత నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు ఇండియన్ ఎకానమీ సర్వే ప్రకారం భారత దేశంలో 7.80 నిరుద్యోగం పెరిగిందని దీనివల్ల భారతదేశం నిరుద్యోగ భారతదేశంగా మారిపోయిందని ఆయన విమర్శించాడు ఇటు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో రెండు లక్షల 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఉద్యోగాలు మొత్తం భర్తీ చేస్తామని ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి 2022 సంవత్సరంలో కేవలం 10,143 జాబ్ క్యాలెండర్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేయడమే కాకుండా మెగాడీఎస్ అని గురించి ఐదు సంవత్సరాలు కాలయాపన చేసి ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంలో 23 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పిన జగన్మోహన్ రెడ్డి కేవలం 6,100 ఉపాదయ పోస్టులకు డీఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి దానిపైన కూడా స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల తీవ్ర గందరగోళం పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ జిల్లాల యువతకు ఉపాధి అవకాశాలు లేక రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వకపోగా ప్రైవేట్ రంగంలోనైనా అంతేగా అవకాశాలు వస్తాయని ఆశీస్సులు అటువంటి యువతకు సరైన పరిశ్రమలు ఏర్పాటు చేయక సాగు, తాగు నీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయకపోవడం వల్ల రాయలసీమ యువత తీవ్ర ఆందోళన ఉందని యువత ఉపాధి అవకాశాల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన సమరశీల పోరాటాలు నిర్వహించి ఉపాధి పొందడం కోసం ఏఐవైఎఫ్ ఉద్యమంలో యువతను భాగస్వాములు చేయడం కోసం మార్చి 15వ తేదీన జిల్లా సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఈ సదస్సులో అధిక సంఖ్యలో నిరుద్యోగులు యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిలు బిసన్న, శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షులు రాజీవ్ నగర నాయకులు చంటి, మునిస్వామి, నగర అధ్యక్షులు బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పురుషుల హ్యాండ్ బాల్ పోటీలు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : 52 వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పురుషుల ఛాంపియన్షిప్‌ను అనంతపురం జట్టు కైవసం చేసుకుంది. అలాగే రెండవ స్థానంలో పశ్చిమ గోదావరి మూడో స్థానంలో కర్నూలు జట్లు నిలిచాయి. ఆదివారం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్. బి .శంకరశర్మ విజేతలకు కప్పులు, పతకాలు ప్రతిభా పత్రాలు అందజేసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల నిర్వహణ కష్టతరమైనప్పటికీ ఇష్టంతో నిర్వాహకులు చేపట్టి విజయవంతం చేయడం తనకి ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో ప్రతిభగనకరించిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి శ్రీనివాసులు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, వివిధ జిల్లాల క్రీడా సంఘ ప్రతినిధులు లక్ష్మణ్ చంద్రశేఖర రావు మహబూబ్ బాషా, జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ప్రతినిధులు సువర్ణ గంగాధర్ కొండపోగు సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అబాకస్,వేదిక్ మ్యాథ్స్ పోటీలు

విశాలాంధ్ర-ఆదోని రూరల్ : విద్యార్థుల మేధోశక్తి పెంపొందించుకునే విధంగా ఆదివారం పట్టణంలోని మల్లికార్జునవిద్యాలయంలో అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలు రైసింగ్ నాలెడ్జ్ సంస్థ సభ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి, వెంకటేష్‌లు నిర్వహించారు. ఈ పోటీల్లో నిర్వహించిన అంశాలు కాంపిటీషన్ పోటీలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహరాజు హాజరయి సమాజంలో చదువుకు ఉన్న ప్రాధాన్యత,విద్యార్థుల భవిష్యత్తు పట్ల క్లుప్తంగా వివరించారు. ప్రస్తుత సమాజంలో బ్రతకడం కష్టం కాకపోయినప్పటికీ, చదువు లేకపోతే గౌరవప్రదంగా బతకడం చాలా కష్టమని భావించవచ్చన్నారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను ఆయన చేతుల మీదుగా ప్రధానం చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు ఆర్థికసాయం

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా బాణాసంచా పేల్చడంతో ప్రమాదవశాత్తు పక్కనున్న గడ్డివాము ఖాళీ బూడిదైంది.ఈ విషయాన్ని తెలుసుకున్న డా. మాచాని సోమనాథ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత రైతును ఓదార్చి తన వంతుగా ఆయన రైతుకు ఆర్థికసాయం అందజేశారు. నియోజకవర్గంలో ఏ రైతు కష్టం వచ్చినా ముందు ఉంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కెవి.కృష్ణ రెడ్డి,ఉరుకుంద రెడ్డి, రవి రెడ్డి, టీంకు, కొండలు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

హొళగుందలో శివలింగం ఊరేగింపు

విశాలాంధ్ర-హొళగుంద : మండల కేంద్రమైన హొళగుందలో ఆదివారం బ్రహ్మర్షి ప్రజాపిత ఈశ్వరియ విశ్వ విద్యాలయం భాగ్యమ్మ ఆధ్వర్యంలో శివలింగాన్ని మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ సర్వ ధర్మాల సారాంశం ఒక్కటేనని ప్రజలు ఆధ్యాత్మికతో మెలగాలని ఉపదేశించారు. ప్రజలు ఈర్ష ద్వేషరాగాలను విడనాడి ప్రేమ అనురాగాలతో జీవించాలని కోరారు. ఓంశాంతి జపాన్ని జపించాలని కోరారు. ఊరేగింపులో బ్రహ్మర్షి కార్యకర్తలు మల్లికార్జునగౌడ, జాతి వీరేష్, ఆటో రుద్రప్ప, భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పోలీసు బలగాలతో కవాతు

విశాలాంధ్ర-దేవనకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు దేవనకొండ సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం కేంద్ర పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. దేవనకొండ పట్టణం తో పాటు మండలంలో తదితర ప్రాంతాల్లో పోలీసు దళాలు, జిల్లా పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్ని కల విధులపై వచ్చిన కేంద్ర బలగాలు ఆయా ప్రాంతాలపై అవగాహన కల్పించారు.రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రతీ ఓటరూ తన ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకునేలా ఆత్మస్థైర్యాన్ని కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలు కవాతు ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర సాయుధ బలగాల వెంట పోలీస్ సిబ్బంది, మహేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర-ఆస్పరి : మండల పరిధిలోనే బిణిగేరి గ్రామంలో కొలువైన శ్రీగిరి క్షేత్రంలోనే పంచలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు పోటాపోటీగా నిర్వహించారు. ముందుగా ఆలూరు వైయస్సార్సీపీ సమన్వయకర్త భూసినే విరుపాక్షి తనయుడు చంద్రశేఖర్, సోదరులు శ్రీరాములు రాష్ట్రస్థాయి వృషభాలు బల ప్రదర్శన పోటీలను ప్రారంభించారు. బండలాగుడు పోటీలో కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బి ఎల్ కే బుల్స్ వృషభాలు మొదటిస్థానంలో నిలిచి రూ.50వేల బహుమతిని అందుకున్నారు. పామిడికి చెందిన కృష్ణంరాజు వృషభాలు, పులికొండకు చెందిన పాతిగారి యాదవ రాజు వృషభాలు రెండో స్థానంలో నిలిచి రూ.40వేలు బహుమతిని అందుకున్నారు. పులికొండ కి చెందిన పాలేగారి రంగస్వామి వృషభాలు మూడో స్థానంలో నిలిచి రూ.30వేలు, యనగొౌడ్ల కి చెందిన వేణుగోపాల్ నాయుడు వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ.20వేలు, బళ్లారికి చెందిన రమేష్ బాబు వృషభాలు అలాగే పుచ్చకాయలమాడకు చెందిన జెల్లీధనుంజయ వృషభాలు ఐదో స్థానంలో రూ.10వేలు బహుమతిని అందుకున్నారు.మొత్తం 11 జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. దూర ప్రాంతము నుండి వచ్చి పోటీల్లో పాల్గొని బహుమతి రాని ప్రతి ఎద్దుల జతలకు కన్సలేషన్ బహుమతి కింద ఆలయ నిర్వహకులు శ్రీనివాసులు నాయనా ఆధ్వర్యంలో రూ.5 వేలు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ లక్ష్మి, డీలర్ సోమన్న, మాజీ చైర్మన్ కేశవరెడ్డి, గ్రామ పెద్దలు చిన్న రెడ్డి, శేషాద్రి నాయుడు, నారాయణ, భీమన్న, శంకర్, వెంకటేష్, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవయే...మాధవసేవ - తోటి కార్మికులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - కల్లూరు: మానవసేవయే మాధవసేవ అని తాను నమ్మిన దృఢ సంకల్పంతో తోటి కార్మికులకు దుస్తులనుమైనార్టీ సంఘం అధ్యక్షులు గౌండ హుస్సేన్ పంపిణీ చేశారు. ఈ మేరకు మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో మైనార్టీ సంఘం అధ్యక్షులు గౌండ హుస్సేన్ స్వగృహంలో ఆదివారం మధ్యాహ్నం కార్మికులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి అనంతరం ప్రతి ఒక్కరికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ పండగను పురస్కరించుకొని ముందస్తుగా తనతో పాటు కార్మిక వృత్తిలో జీవనం సాగిస్తున్న తోటి మిత్రులకు తన వంతు సహాయ సహకారాలు అందించాలని ఈ యేడాది రంజాన్ పండగ ప్రారంభం కాకముందే రూ.50 వేల విలువచేసే వస్తువులను 50 మంది కార్మికులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. రంజాన్ పండుగ వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈదుగాలు ,మసీదులు కూడా రంగులు ఉచితంగా పూయించి అన్ని హంగులతో రూపు దిట్టడం జరిగిందని వెల్లడించారు. భవన నిర్మాణ రంగంలో వందలాది కుటుంబాలు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తనతో పాటు 40 మంది కార్మికులు నిత్యం పనుల్లో పాల్గొని చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని వారిని కొంతైనా ఆదుకోవాలనె నెపంతో ప్రతి ఏడాది తనతో పాటు పనిచేసే కార్మికులందరికీ తనకు తోచినంతగా తనకొచ్చిన ఆదాయంలో కూడబెట్టుకొని దుస్తులు అందజేసి వారికీ అండగా నిలుస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు గౌండ రఫీ, సుంకన్న , హనీప్, వెంకటేష్ , గుడిపాడు మధు, మహేష్ , షరీఫ్, ఫాయాజ్ , మౌలి, మధు ,దస్తగిరి, నాగేశం, మద్దిలేటి, ఇదురుష్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

విశాలాంధ్ర-ఆదోని రూరల్ : ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో అక్రమ కర్ణాటక మద్యం భారీగా తరలిస్తున్నారన్న సమాచారంతో సెబ్ పోలీసులు కంట మీద కునుకు లేకుండా రాత్రి వేళల్లో గస్తీ పటిష్టంగా నిర్వహిస్తున్నారు.ఆదివారం రాత్రి గం 12:30 ల సమయంలో కడితోట గ్రామం వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనంలో దాదా పు 40 బాక్సులు (ఒరిజినల్ ఛాయిస్ విస్కీ) కర్ణాటక మధ్యాన్ని చిదానంద,నరసప్ప అను నిందితులు తరలిస్తుండగా సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపర్ ఇంటెలిజెన్స్ వినోద్ కుమార్ మీడియా ద్వారా తెలియజేశారు. దాదాపు వాటి విలువ రూ,,2లక్షలు ఉంటుంది.తెలిపిన వివరాలు ఇలా ఉండగా ఆదివారం సెబ్ ఇన్స్పెక్టర్ ఫన్నీలతా ఆధ్వర్యంలో ఎస్సై ఇస్మాయిల్, ఇంటిలిజెన్స్ కానిస్టేబుల్ సోమేశ్వర్, డివిజనల్ టాస్కోర్స్ ఎస్ఐ వీరస్వామి మరియు ఇతర సిబ్బందితో రూట్ వాచ్ నిర్వహిస్తుండగా టాటా విస్టా వాహనం సెబ్ అధికారులను చూసి ఆపకుండా వేగంగా వెళ్లడంతో అనుమానం వచ్చి పోలీసులు వెంబడించడంతో సినీ పక్కిలో అక్రమ తరలింపు వాహనం సబ్ వాహనాన్ని ఢీ కొట్టి ఒక బండరాయికి టైర్లు తగులుకొని ఆగిపోవడం జరిగిందని తెలిపారు. అక్రమ కర్ణాటక మద్యం తరలింపు దారులు మొదటి ముద్దాయిగా చిదానంద, రెండవ ముద్దాయిగా నరసయ్యలను గుర్తించడం జరిగిందన్నారు.వారితోపాటు మరో ముగ్గురు నిందితులను గుర్తించినట్లు చెప్పుకొచ్చారు.అక్రమ కర్ణాటక మద్యం రవాణపై విచారణ చేయడం జరుగుతుందన్నారు.అక్రమ మద్యం తరలింపు వెనక ఉన్న ముఠాను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

పటిష్టమైన దాడులు నిర్వహించి పలు కేసులు నమోదు

త్వరలో రానున్న ఎలక్షన్ల నేపథ్యంలో ఎలాంటి ఒత్తిళ్లకు లోనవ్వకుండా అక్రమ మద్యంపైన సెబ్ పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు.22జనవరి 2024 బదిలీలో భాగంగా ఆదోని సెబ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన సిబ్బంది ఇప్పటిదాకా జిల్లా సెబ్ గణాంకాలు ప్రకారం అక్రమ మద్యంపై 432 కేసులు నమోదు చేసి అందులో ప్రమేయమున 392 మందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది. దాదాపు 60 వాహనాలను సీజ్ చేశారు. అక్రమ మద్యం తరలింపు పై ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

కేంద్ర సాయుధ బలగాలతో పోలీసుల కవాతు

విశాలాంధ్ర-కర్నూలు జిల్లా పరిషత్తు : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూల్ జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజలలో భరోసా కల్పించడంతో పాటుగా అల్లర్లు జరగ కుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా శాంతిభద్రతలు కాపాడడానికి కేంద్రసాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించా రన్నారు. జిల్లాలోని ఎమ్మిగనూరు, కర్నూలు, పత్తికొండ సబ్ డివిజన్ లలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయిధ బలగాలైన "సశస్త్ర సీమా బల్" సిబ్బందితో కలిసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఆర్. కొంతలపాడు, ఉల్చాల గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్‌ను కర్నూలు డిఎస్పీ విజయ శేఖర్ పర్యవేక్షణలో కర్నూలు తాలుకా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎమ్మిగనూరు డి ఎస్పీ సీతరామయ్య పర్యవేక్షణలో ఎమ్మిగనూరు టౌన్, రూరల్ సీఐలు మధుసుధన్‌రావు, మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీ సులు కవాతు నిర్వహించారు.పత్తికొండ డిఎస్పీ శ్రీని వాస రెడ్డి పర్యవేక్షణలో దేవనకొండ యుపిఎస్ సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేవనకొండ, వెల్మకూర్, కోటకొండ ,కప్పట్రాళ్ల గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు.ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

పేదవిద్యార్థికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర -డోన్: బి.ఫార్మసి చదువుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థికి యమున నాగేశ్వరమ్మకి ఆర్థికసాయం అందిచేసి మాన వత్వం చాటుకున్నారు కేవీయస్ హాస్పిటల్ యాజమాన్యం.డోన్ పట్టణంలోని రాజా కాంప్లెక్స్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రెండు రోజుల క్రితం మహిళా దినోత్సవం వేడుకలకు హాజరైన మహిళ డోన్ పట్టణానికి చెందిన సూర్య పద్మ కూతురు తిరుపతిలో బీఫార్మసీ చదువుతుంది. ఉచిత సీటు వచ్చినప్పటి ఫీజు కట్టలేని స్థితిలో ఉన్నానని తల్లి పద్మ ఇబ్బంది పడుతున్నానని ఆమె దృష్టికి తీసుకెళ్ళింది.ఆమె వెంటనే పేద విద్యార్థి చదువుతున్నప్పటికీ ఇలాంటి ఇబ్బంది పడకూడదని.. నా వంతుగా ఆర్థికసాయం చేస్తానని కేవియస్ ఆసుపత్రి యాజమాన్యం వైద్యురాలు దీపిక హామీ ఇచ్చి... ఆదివారం కేవి యస్ ఆసుపత్రి లో విద్యార్థికి 15 వేలు అందజేశారు. కెవిఎస్ యాజమాన్యం దంపతులను డాక్టర్ దీపిక,డాక్టర్ దంపతులను మహిళా సమైక్య, సీపీఐ పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించినటువంటి కెవిఎస్ హాస్పిటల్ డాక్టర్లకుకృతజ్ఞతలు తెలుపుతూ.. చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ సీపీఐ పి.సుంకయ్య,సిపిఐ పట్టణ కార్యదర్శి బి. నారాయణ,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్య ప్రతాప్,ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శబన, నాయకులు అమృత రెడ్డి,సూర్య, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి-కేఈ శ్యాంబాబు

విశాలాంధ్ర-పత్తికొండ: తెలుగు దేశంపార్టీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందడం జరిగిందని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కేఈ. శ్యాంబాబు పేర్కొన్నారు. ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండలంలోని దూదేకొండలో చేపట్టి, తెదేపా 2024 ఎన్నికల మేనిఫెస్టో బాబు సూపర్ సిక్స్ పథకాలు కేఈ శ్యాంబాబు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయడం జరిగింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏ మాత్రం అభివృద్ధి చేసింది లేదన్నారు. టీడీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందడం జరిగిందని గుర్తు చేశారు. చంద్రబాబు తోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మాల మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-హొళగుంద: నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగ భక్తులు ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో స్వామివారి ఆలయం కిటకిటలాడింది.ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలమల్లేశ్వరస్వామికి ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ వీరభద్రగౌడ, యువ నాయకుడు బి.గిరిమల్లేష్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. రాత్రిభజన కార్యక్రమాలు జరిగాయి హొళగుంద సిద్దేశ్వర స్వామి ఆలయం, చినిగిసాబ్, సాయిబుఅన్న దర్గ, ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలలో భక్తులు ప్రత్యేక ఫాతిహాలు చదివించారు. భక్తులతో దర్గాలు కిటకిటలాడాయి. ఎస్సై పెద్దయ్య నాయుడు పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఆదోని పట్టణంలోని శ్రీ మల్లికార్జున ఉన్నత పాఠశాలలో ఆర్కే ఇన్సిట్యూట్ వారు ఆదివారం జిల్లాస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. ఇందులో పెద్దకడబూరుకు చెందిన శ్రీ బాలవికాస్ యూపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 4వ తరగతి చదువుతున్న ఔచిత్య, 2వ తరగతి నందు ఎం.లాస్య మొదటి బహుమతి గెలుపొందారు. అబాకస్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఇందిర, ఉపాధ్యాయులు విజ్జన్న, బొజ్జప్ప తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జగన్ సంక్షేమ పథకాలపై ఇంటింటికి ప్రచారం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలపై ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో వైసీపీ నేత మూకిరెడ్డి, గృహసారథులు ఆదివారం ఇంటింటికి వెళ్లి వివరించారు. సంక్షేమ పథకాలు పేదలకు అందాలంటే మళ్లీ సీఎంగా జగన్మోహన్ రెడ్డిని చేసుకోవాలని సూచించారు. టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మి మరోమారు మోసపోవద్దన్నారు. చంద్రబాబుకు ఓటు వస్తే సంక్షేమ పథకాలు అందవని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరో మారు ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని నాల్గోసారి గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మస్తాన్ వలి ఉరుసు మహోత్సవాలు

విశాలాంధ్ర - చిప్పగిరి: మండల పరిధిలోని నంచర్ల గ్రామంలో మహాశివరాత్రి పండగ పురస్కరించుకొని హజరత్ దివాన్ మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నంచర్ల గ్రామంలో వెలిసిన హజరత్ దివాన్ మస్తాన్ వలి 38 వ ఉరుసు మహోత్సవాలను అంగరంగ వైభవంగా మంగళ వావిద్యాల మధ్య గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున హజరత్ దివానే మస్తాన్ వలి దర్గా నుండి అశ్వంపై ప్రతిమను ఉంచి గ్రామ పూరవీధుల గుండా ఊరేగించి గ్రామములోని సుంకులమ్మ దేవాలయం వరకు వెళ్లి తిరిగి దర్గాను చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా భక్తాదులు మొక్కులు తీర్చుకున్నారు.

కన్నుల పండగ రథోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తి సమీపంలోని బ్రహ్మగుండ క్షైవక్షేత్రంలో శ్రీ బ్రహ్మేశ్వరస్వామి, గంగాదేవి, గౌరీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో హర హర మహా దేవ శంభో శంకర అంటూ రథోత్సవం కన్నుల పండగ రథోత్సవాన్ని గ్రామ పెద్దలు బొమ్మన దశరథ రామిరెడ్డి మండల కన్వీనర్ రవి రెడ్డి రథోత్సవాన్ని ముందుకు సాగించారు. రథోత్సవం తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఆంజనేయ సంఘటన జరగకుండా గట్టి బందోబస్తు నడుమ రథోత్సవ కార్యక్రమం ముగిసింది. సిఐ సురేష్ కుమార్‌రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 11, మార్చి 2024

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణయే అంతిమలక్ష్యం

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణ పరిధిలో రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే తమ లక్ష్యమని పట్టణ సీఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఆళ్లగడ్డ డి.ఎస్.పి. షేక్‌షర్పుద్దిన్ సూచనలతో ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామమైన పెద్ద చింతకుంట్ల, దేవరాయపురం గ్రామాలతో పాటు పట్టణంలోని పాత బస్టాండు, బాలాజీ నగర్ , తోమ్మంద్రు వీధి, నాలుగు రోడ్ల జంక్షన్, కొత్త బస్టాండు, ఏసునాధపురం తదితర కాలనీలలో పోలీసుల కవాతు నిర్వహించారు.బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వరింధర్ కుమార్, ఆళ్లగడ్డ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.రమేష్ బాబు, సబ్ ఇన్స్పెక్టర్ కే పి బి.వెంకట్ రెడ్డి , బిఎస్ఎఫ్ సిబ్బంది, ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ సిబ్బంది తో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ రమేష్ బాబు మాట్లాడుతూ ఎన్నికను ప్రశాంతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పోలీసులు ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తులు సంఘ విద్రోహ చర్యలకు పాల్పడ కుండా హెచ్చరించామన్నారు. కాలనీలలో ప్రజలకు ఎన్నికల గురించి అవగాహన నిర్వహించామన్నారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని ప్రజల్లో భరోసా కల్పించామన్నారు. ఎలాంటి సమస్య ఉన్న పోలీసుల దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

మేనల్లుడు కాలయముడయ్యాడు- మాజీ ప్రిన్సిపల్ దారుణహత్య

విశాలాంధ్ర - అనంతపురం జేఎన్టీయూ: అనంతపురం పట్టణంలోని జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం ముఖద్వారం సమీపంలో ఓ ప్రైవేట్ కళాశాలలో మాజీ ప్రిన్సిపల్ గా పనిచేసిన మూర్తిరావు ఖోకిలే ను ఆదివారం రాత్రి మేనల్లుడు బ్లేడుతో దారుణ హత్యకు ఒడిగట్టినట్లు స్థానికులు తెలిపారు. పెళ్లి సంబంధాలు రాకుండా మామ మూర్తి అడ్డుకుండం పట్ల ఈ హత్యకు కారణమైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దారుణ హత్యపై విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని హత్య చేసిన నిందితుడును వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మృదు స్వభావి, విద్యార్థుల ఆకాంక్షలకు నిరంతరం తపించే ప్రిన్సిపల్ దారుణం హత్య విషాదాన్ని మిగిల్చింది. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా..

విశాలాంధ్ర-నందికొట్కూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిడిపి లీగల్‌సెల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జి.నాగముని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చే న్నాయుడు ఆదివారం అమరావతిలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగ ముని మాట్లాడుతూ నంద్యాల జిల్లా నుండి ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నేను గత 30 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో పనిచేస్తూ, మరియు 18 సంవత్సరాలు న్యాయవాదిగా, మరియు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా సిన్సియారిటిగా పనిచేస్తూ అధికారుల, ప్రజాప్రతినిధుల మన్ననలు పొంది,విశేషంగా ప్రజలకు సేవలందించడం జరిగిందన్నారు. నంద్యాల జిల్లా టిడిపి పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర. శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్ గౌరు.వెంకటరెడ్డి, పాణ్యం నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల.రాజశేఖర్, కర్నూలు జిల్లా అధ్యక్షులు బిటి. నాయుడు, మరియు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 నియోజకవర్గాల టిడిపి నాయకుల సహకారంతో, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు, నారా.భువనేశ్వరి, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పోసాని.వెంకటేశ్వర్లు లు నాకు తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా నియమించడం పట్ల వారందరికీ పేరుపేరునా, ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలియజేశారు. అధిష్టానం నాకు ఇచ్చిన ఈ బాధ్యతను మరింత ఉత్సాహంగా, పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా పనిచేస్తూ, వచ్చే సార్వత్రిక ఎలక్షన్లలో తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేస్తానన్నారు..

ముఖ్యమంత్రి జగన్ వల్లే రోడ్ల మరమ్మతు



విశాలాంధ్ర-హొళగుంద: మార్లమడికి క్రాస్ రోడ్డు నుండి నాగరకణ్వి, హెన్నూరు వరకు ఆదివారం రోడ్డు పనులను సర్పంచ్ శారదమ్మ వైసీపీ నాయకులు నాగిరెడ్డి, నాగేశప్ప, మోహన్,రాజులు ప్రారంభించారు. సర్పంచు శారదమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వల్లే రోడ్డు మరమ్మత్తులు జరుగుతున్నాయని కొనియాడారు ఎంతో అధ్వానంగా ఉన్న రోడ్డును ఆలూరు నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ బి విరుపాక్షి సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతు చేస్తున్నారన్నారు. వర్షాకాలంలో కాలినడకన నడవలేని స్థితిలో ఉన్నరోడ్డు మరమ్మతకు విరుపాక్షి మరమ్మత్తు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు అధ్వానంగా ఉన్నప్పటికీ విద్యార్థులు ప్రజలు నానా అవస్థలు పడుతూ అవసరాలు తీర్చుకున్నారని రోడ్డుపైన మత్తు పనులు నాణ్యతగా జరుగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రోడ్డు మరమ్మతు చేసినందుకు ముఖ్యమంత్రికి ఆలూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ విరుపాక్షికి సర్పంచుశారదమ్మ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఆలూరు ఎమ్మెల్యేగా విరుపాక్షిని ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, బసవన్నగౌడ్, మల్లారెడ్డి, కేశవరెడ్డి, నాగేశప్ప, మోహన్‌రాజు, వెంకట రామిరెడ్డి, బసలింగప్ప, గాదిలింగప్ప, ఆటో రాజా, ప్రజలు పాల్గొన్నారు

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వెలుగోడు : వెలుగోడు గ్రామంలోని వెంగలరెడ్డినగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారారూ.5లక్షలతో వేసిన సీసీరోడ్డు, ఈద్గా దగ్గర జడ్పి.డి.యఫ్ రూ.5 లక్షలతో వేసిన సీసీ రోడ్డు, లక్ష్మీనగర్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రూ.7.60 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శిలా ఫలాకాన్ని అవిష్కరించి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు అభిమానులు కాలనీ వాసులు పాల్గొని విజయవంతం చేశారు.

విద్యుత్తు సమస్యకు శాశ్విత పరిష్కారం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ పంచాయతీలో విద్యుత్తు సమస్య శాశ్విత పరిష్కారానికి రూ.30 లక్షల వ్యయంతో ఐదు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసినట్టు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికాంత్ చౌదరి పేర్కొన్నారు. 160 కేవీ కెపాసిటీ గల 5 ట్రాన్ఫార్మర్స్‌ను ఆదివారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రామాలయం వద్ద అనకట్ట, కుంట సమీపంలో 100 కేవీఏ -3, హై స్కూల్, సినిమా హాల్ సమీపంల, హుస్సేన్ మాస్జిద్ దగ్గర ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రంజాన్ మాసం సందర్భంగా శిరివెళ్ల గ్రామంలో లోఓల్టేజ్ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు.ఇందుకు సహకరించిన సూపర్‌ఇంటెండెంట్ ఇంజనీర్ ఎం.ఉమాపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ రమణారెడ్డిలకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.వారి వెంట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున, సిబ్బంది ఉన్నారు.

కమనీయం.. కొత్తబుగ్గ రాథోత్సవం

విశాలాంధ్ర -డోన్ : డోన్ పట్టణ సమీపంలో కొత్త బుగ్గ, కొత్తబుగ్గలో మహాశివరాత్రి సందర్భంగా రాథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జనసందోహం మధ్యన జరిగింది.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్య సేవలు : మహాశివరాత్రి సందర్భంగా కొత్త బుగ్గలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.డోన్ డివిజన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మూడో రోజు కొనసాగుతున్న వైద్య శిభిరాన్ని రెడ్ క్రాస్ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొత్త బుగ్గ రామలింగేశ్వర స్వామి సన్నిధి నందు మూడవ రోజు కొనసాగించారు.భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందించారు.ఈ వైద్య శిబిరంలో సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ , రెడ్ క్రాస్ సభ్యులు గ్రామీణ వైద్యులు ఏ బాల సుబ్బయ్య,ప్రవీణ్, రఘురాం, వెంకటస్వామి, మల్లికార్జున ఆచారి ,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సిద్ధారూఢస్వామి రథోత్సవం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరులో వెలసిన శ్రీశ్రీశ్రీ సిద్ధారూఢస్వామి రథోత్సవం ఆదివారం అశేష భక్తవాహిణి నడుమ కన్నుల పండుగగా జరిగింది. ఉదయం స్వామివారికి ఆకుపూజ, కుంకుమార్చన, బిల్వర్చన, పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ పెద్దలు హనుమంతరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాబురెడి శ్రీ సిద్ధారూఢస్వామి ఆలయం నుండి ఊరేగింపుగా వెళ్ళి రథాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం 5 గంటలకు ఆలయం నుండి ఉత్సవమూర్తిని కలసాలతో ఊరేగింపుగా మంగళవాయిద్యాలతో సుందరంగా అలంకరించిన రథం వద్దకు తీసికెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ వీఆర్వో రామలింగారెడ్డి ఇంటి నుండి స్వామివారి పూర్ణకుంభాన్ని మంగళవాయిద్యాలతో, డ్రమ్స్ లతో ప్రధాన రహదారి వెంబడి ఊరేగింపుగా రథం వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఉత్సవమూర్తిని రథంపై ప్రతిష్ఠించారు. అనంతరం అశేష భక్తవాహిణి నడుమ రథోత్సవం రమణీయంగా సాగింది. మహిమాన్వితుడుగా వెలుగొందుతున్న శ్రీ సిద్ధారూఢస్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరై ఆయన కృపకు పాత్రులయ్యారు.

స్వామివారికి పలువురు ప్రత్యేక పూజలు

శ్రీ సిద్ధారూఢస్వామి రథోత్సవం సందర్భంగా వైసీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, సచివాలయ జేసీసీ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రఘురామ్, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, టీడీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, తిమ్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మండల ప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పూజారి ఈరన్న, విజేయేంద్రరెడ్డి, జాము మూకయ్య, బ్రహ్మయ్య ఆచారి, ముక్కరన్న, అర్లప్ప, మొత్రు దస్తగిరి టీడీపీ నాయకులు కోడిగుడ్ల ఏసేపు, మీ సేవ ఆంజనేయులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోస్పాడు సమస్యలను పరిష్కరిస్తాం- టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

విశాలాంధ్ర-నంద్యాలరూరల్ : నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని నంద్యాల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండల కేంద్రంలో ఆదివారం 'చాయ్ పే చర్చ' కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి కంటే టిడిపి అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చాయ్ పే చర్చ జరిగింది. ఈ కార్యక్రమం గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , పల్లె విశ్వనాథరెడ్డి , గోస్పాడు మండల క్లస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది.నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ గోస్పాడు మండలం సమస్యల నిలయంగా మారిందని టిడిపి అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని నంద్యాల ఎమ్మెల్యే ఎప్పుడు శిలాఫలకాల కోసమే పాకులాడుతాడు గాని అభివృద్ధి చేద్దామని ఏనాడు అనుకోలేదన్నాడు గతంలో తెలుగుదేశం పార్టీలో చేసిన అభివృద్ధి తప్ప గోస్పాడులో ఈ వైసీపీ చేసిన అభివృద్ధి ఏమీ లేదని కాబట్టి ప్రజలు గమనించి తెలుగుదేశం పార్టీకి ఓటేసి గెలిపించుకోవాలని అలా గెలిపించుకుంటే చంద్రబాబు మేనిఫెస్టోలో పెట్టిన పథకాలన్నీ అమలు చేస్తామన్నారు .అలాగే గోస్పాడు పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ద హుస్సేన్ సాబ్ , ఓంటలగల భాస్కర్ రెడ్డి , యాల్లూరు వెంకట్ రెడ్డి , జూలపల్లి సుదర్శన్ రెడ్డి , కానాలపల్లి శేఖర్ రెడ్డి , రాయపాడు కృష్ణారెడ్డి , గోస్పాడు నాయకులు శ్రీనివాసు , హుసేని , వెంకటయ్య , వెంకటేశ్వర్లు , మనోజ్ , హుసేని , పేరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బాబు సూరిటి -భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రము లోని శిరివెళ్ల మేజర్ పంచాయతీలో మాజీ మంత్రి అళ్ల గడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిల ప్రియవరుసగా మూ డో రోజు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం సై తం కొనసాగించారు.ఆపార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టోను ఇంటింటికి తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ బాబు ష్యూరిటి-భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేసి ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బీసీ ఖాజా హుసేన్, ఎన్ మౌళి భాష, బిఎండి యునుస్, బిసి ఫిదా,ముహమ్మద్ హుసేన్, గుర్రప్ప బి ఎండి ఇస్మాయిల్, ఎన్ సిద్దిక్, రఫీ, ఎన్ ఇర్ఫాన్, గౌండ యునుస్ షఫి వుల్ల, సికిందర్, పందు మాభాష, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో నీటి వసతి ఏర్పాటు

విశాలాంధ్ర-రుద్రవరం: మండలంలోని ఆలమూరులోని స్మశాన వాటిక స్థలంలో ఎన్నో ఏళ్లుగా నీటిసమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స ర్పంచు పాణ్యం లక్ష్మీదేవి వైసీపీ నాయకు డు నగేష్ స్పందించి స్మశాన వాటిక స్థలంలో నీటిట్యాంకును ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా గ్రామానికి చెందిన వారు మృతి చెందితే గ్రామస్తులు అంత్యక్రియల నిమిత్తం అక్కడికి వెళ్లి అక్కడ నీటి వసతి లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. స్మశానవాటిక స్థలంలో నీటి వసతి ఏర్పాటు చేయాలంటూ గ్రామస్తులు కోరగా శాశ్వతంగా స్మశాన వాటిక స్థలం లో నీటి వసతి ఉండేటట్లు స్మశాన వాటిక స్థలంలో ట్యాంకును , స్థానిక దళిత కాలనీలో మరొక ట్యాంకును ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు సర్పంచ్ లక్ష్మీదేవికి , నగేష్ కు ధన్యవాదాలు తెలిపారు.

మూడు పార్టీల పొత్తు చారిత్రాత్మకం

విశాలాంధ్ర-బనగానపల్లె : తెలుగుదేశం, జనసేన, బిజెపి పొత్తు చారిత్రాత్మకమని నియోజవర్గం టీడీపీ ముస్లిం మైనార్టీ నియోజవర్గ అధ్యక్షుడు రాయలసీమ సలాం పేర్కొన్నారు. రాయలసీమ సలాం మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఢిల్లీలో టీడీపీ, జనసేన, బిజెపి పొత్తు ఖాయమైనట్లు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తెలపడం జరిగిందన్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈకూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ 50 రోజులు సమిష్టిగా కృషిచేసి నియోజవర్గంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా గెలిపించు కుంటామన్నారు. ముస్లింల అభివృద్ధి చెందాలంటే ఈకూటమి అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. త్వరలో బాయ్ బాయ్ జగన్ అని ప్రజలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మాజీ జడ్పీటీసీ మృతికి భూమా సంతాపం

విశాలాంధ్ర-చాగలమర్రి: మండలంలోని మూడురాళ్ళపల్లె గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ పులి వీరమ్మ(82) శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, హరిచంద్రా రెడ్డి నరసింహారెడ్డి ,బ్రహ్మానందరెడ్డి, తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధి కోసమే పార్టీ మార్పు

విశాలాంధ్ర-అవుకు: గ్రామ అభివృద్ధి కోసమే పార్టీ మారినట్లు సుంకేసుల గ్రామానికి చెందిన కైప చంద్రశేఖర్ రెడ్డి, కైపా వెంకట్రామిరెడ్డి, మంచాల వీర ప్రతాప్ రెడ్డిలు తెలిపారు. ఈనెల 7న బనగాన పల్లె మాజీ శాసనసభ్యులు బీసీ జనార్ధన్‌రెడ్డి సమ క్షంలో సుంకేసుల గ్రామానికి చెందిన 100 కుటుం బాలు తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుంకేసుల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో వైసీపీ పార్టీలో ఉండేవారని ఆ పార్టీలో తగిన ప్రాధాన్యత, గుర్తింపు లేకపోవడం వలన పార్టీ మారాల్సి వచ్చిందని అన్నారు. గత ప్రభుత్వంలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చెంద లేదన్నారు. గతంలో శాసనసభ్యుడిగా ఉన్న బీసీ జనార్దన్ రెడ్డి గ్రామాన్ని ఎంతగానో అభివృద్ధి చేశా రని మరల అలాంటి అభివృద్ధికావాలంటే బీసీ జనార్దన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని గ్రామ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. గ్రామంలో బీసీ జనార్దన్ రెడ్డి సహకారం తో మినరల్ వాటర్ ప్లాం ట్ ను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణాన్ని కూడా చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల భాస్కర్ రెడ్డి, బొల్లవరం శ్రీనివాసరెడ్డి, నరాల శివప్రసాద్ రెడ్డి,ఖమ్మం శ్రీనివాసులు, కుమ్మరి గంగన్న, వేములపాటి శివప్రసాద్ రెడ్డి, ఏ సుంకన్న, కుమ్మరి మునయ్య, రమణ, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ప్రభుత్వ హాస్పిటల్ లో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు ప్రభుత్వ హాస్పిటల్ లో మౌలిక వసతులు కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్ నాయక్, ఏపీ ప్రజారవాణా సంస్థ ఎస్సీ ఎస్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలయ్య అన్నారు.ఆదివారం నాడు ఆత్మకూరు పట్టణంలో ప్రతి ఆదివారం జైభీమ్ జై భారత్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఒక దండ,ఒక దండం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని, ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రములో శాస్వత మంచినీటి సమస్య పరిష్కారం కోసం రెండు మంచినీటి బోర్లు వేయించాలని,మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని,ఎక్స్ రే సెంటర్ ను ఏర్పాటు చేయాలని,ఆక్సిజన్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని,ఇప్పుడు ఉండే 30 పడకల హాస్పిటల్ ను 50 పడకల హాస్పిటల్ గా మార్చాలని,ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రజా రవాణా సంస్థ ప్రాంగణమును ప్రపంచ మేధావి,అందరి వాడు,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,భారత రాజ్యాంగ నిర్మాత,భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరు మీదుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రజా రవాణా సంస్థ ప్రాంగణంగా నామకరణం చేయాలని వారు అధికారులు, ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, నాగస్వామి నాయక్, రమేష్ నాయక్, సురేష్, దాసు, ప్రతాప్, మల్లికార్జున నాయక్, నాగరాజు నాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం

విశాలాంధ్ర-హొళగుంద: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందిస్తామని కే 12 టెక్నో కంపెనీ అధిపతి రాజీవ్ అన్నారు హొలగుంద రూరల్ డెవలప్మెంట్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు హసన్ షేక్ అధ్యక్షతనలోహొలగుందలో ఆదివారం యంగ్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూలు నుకె 12 టెక్నో కంపెనీ అధినేత రాజీవ్ ప్రారంభించి ఆయన మాట్లాడుతూ తమ కంపెనీ ఆధ్వర్యంలో 90 పాఠశాలలు నడుస్తున్నాయని అలాగే మెట్రోపాలిసిటీ నగరాల్లో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నామని అన్నారు అయితే ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు తక్కువ ధరతో నాణ్యమైన విద్య అందిస్తామని అన్నారు పాఠశాలలో విద్యార్థులను చేర్పించి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు కేవలం విద్యార్థులకు పుస్తకాలకు పరిమితం కాకుండా ఆచరణాత్మకమైన విద్యాబోధన కల్పిస్తామని పరిసరాలను చూస్తూ విద్యను సులభంగా నేర్చుకోవడానికి శిక్షణ ఇస్తామని స్పష్టం చేశారు ఎంతో ప్రావీణ్యం పొందిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు అన్ని విధాల విద్యా బోధన కల్పిస్తామని విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ నేర్పుతామని అన్నారు విద్యార్థులకు ఎలాంటి కష్టం కాకుండా ఇష్టంతో చిత్రాలు, పరిసరాలు, గ్రాఫ్లు, ఆచరణాత్మకమైన విద్య నేర్పుతామని అన్నారు విద్యలో విద్యార్థులు రాణించాలని విజ్ఞప్తి చేశారు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు మరియు వారి కెరీర్ విజయవంతానికి యంగ్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు ఆరోగ్యకరమైన వాతావరణం పక్క భవనాల్లో విద్యార్థులకు విద్యాబోధన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.